ఆగమేఘాల మీద సర్వేలు

- ఇందిరమ్మ ఇండ్లకు 39 వేలు, రేషన్ కార్డులకు 2861 దరఖాస్తులు..
- ఇండ్లకు రాకుండానే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వే
- దరఖాస్తుదారుల ఆందోళన..

జూబ్లీహిల్స్, జనవరి 20 : యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని బస్తీలు, కాలనీల్లో ఇందిరమ్మ ఇండ్లు.. రేషన్ కార్డుల సర్వే ముమ్మరంగా చేపడుతున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. పేదలు సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ప్రజా పాలన పథకంలో 39 వేల మంది ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు చేసుకున్నారు. అన్ని పథకాలకు ప్రామాణికంగా నిలిచే కొత్త రేషన్ కార్డుల కోసం సమగ్ర కుటుంబ సర్వేలో 2861 మంది నమోదు చేయించుకున్నారు. కాగా సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల సర్వే విజయవంతంగా పూర్తయింది. ప్రజాపాలనలో అందిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వేను జీహెచ్ఎంసీ సిబ్బంది చేపడుతుండగా.. సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్ కార్డుల దరఖాస్తులను రెవెన్యూ, సివిల్ సప్లై సిబ్బంది చేపట్టారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్‌లో అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు అందాయి. ప్రజా పాలన పథకంలో కొంత మందికి ఇందిరమ్మ ఇండ్ల ఆప్షన్ ఎంట్రీ కాకుండా ఉన్నప్పటికీ యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 39 వేలకుపైగా దరఖాస్తులు అందడం విశేషం.

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేస్తున్న సిబ్బంది

ప్రజా పాలనలో నమోదుకాని ఇందిరమ్మ ఇండ్ల జాబితా

ప్రజాపాలన పథకంలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న వారికి నిరాశ ఎదురవుతుంది. నగరంలో దశాబ్దాలుగా అద్దె ఇండ్లలో నివాసముంటున్న వారు ఎక్కువగా సొంతింటిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే ఆఘమేఘాల మీద తీసుకున్న ఈ దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియ పారదర్శకంగా చేయకపోవడంతో కొంతమంది లబ్ధిదారుల పేర్లు జాబితాలో లేకుండా పోయాయి. దీంతో ఒకవైపు దరఖాస్తుదారులు.. మరోవైపు సర్వే సిబ్బంది అయోమయానికి గురైన పరిస్థితి నెలకొంది.

- ఇందిరమ్మ ఇండ్లు ఎంట్రీ చేయడంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల అలసత్వం ఆయా లబ్ధిదారులకు శాపంగా మారింది.
- సర్వే చేసేందుకు సిబ్బంది తమ ఇంటికి రాలేదని దరఖాస్తుదారులు యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు.
- సమగ్ర సర్వేలో రేషన్ కార్డుల కోసం నమోదు చేసుకున్న దరఖాస్తుదారులు సర్వే చేసేందుకు సిబ్బంది మా గృహాలకు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అధికారులు సర్వే పూర్తయినట్లు చెప్పడంతో అయోమయ పరిస్థితి నెలకొంది.

మళ్లీ దరఖాస్తులు చేసుకునే అవకాశం

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, రేషన్ కార్డుల లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందిరమ్మ ఇండ్లకు చేసుకున్న దరఖాస్తులలో 24,335 లబ్ధిదారుల సర్వే పూర్తయింది. కొత్త రేషన్ కార్డుల కోసం అందిన 2861 దరఖాస్తుల సర్వే 100 శాతం పూర్తయింది. రేషన్ కార్డులలో, ఇందిరమ్మ ఇండ్లలో పేర్లు లేనివారు తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తాం. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాలు అందగానే ప్రకటిస్తాం.

డిప్యూటీ కమిషనర్, జాకియా సుల్తానా

కమ్యూనిటీ ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకోవాలి

బంజారాహిల్స్,జనవరి 20: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో యూసీడీ విభాగం తరపున కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా పనిచేస్తున్న బుచ్చమ్మ అనే మహిళ తన విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు మహిళా సమాఖ్యలను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నారంటూ స్థానిక మహిళా సంఘం నాయకులు సోమవారం జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అదనపు కమిషనర్ చంద్రకాంత్‌కు ఫిర్యాదు చేశారు. కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా మహిళా సమాఖ్యల్లో సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాల్సిన బుచ్చమ్మ కొత్త సమస్యలను సృష్టిస్తున్నారన్నారు. రుణాలు ఇప్పించేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని, కుల గణన, ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో సైతం మహిళా సమాఖ్య సభ్యులకు కాకుండా ప్రైవేటు వ్యక్తుల చేత చేయించడంతో లబ్ధిదారుల ఎంపికలో కూడా అవకతవకలు జరిగే అవకాశం ఉందన్నారు. వెంటనే యూసీడీ విభాగం కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా బుచ్చమ్మ స్థానంలో మరో అధికారిణిని నియమించాలని మహిళా సంఘం నేతలు జి.వరలక్ష్మి, ప్రభావతి తదితరులు కోరారు.

సంక్షేమ పథకాల ఎంపికకు.. నేటినుంచి గ్రామసభలు

శంషాబాద్ రూరల్, జనవరి 20 : సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం నేటినుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మున్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నేరుగా గ్రామ సభలోనే ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో సభలు నిర్వహిస్తామన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని వివిధ వార్డులతో పాటు కొత్తగా మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలు పెద్దగోల్కొండ, ఘాన్సిమియాగూడ, చిన్నగోల్కొండ, బహదూర్‌గూడ, హమిదుల్లానగర్, రషీద్‌గూడ గ్రామాలలో ప్రత్యేక సభలు ఏర్పాటు చేస్తామని కమిషనర్ సుమన్‌రావు తెలిపారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభం

ఖైరతాబాద్, జనవరి 20 : ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, యూసీడీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు రజనీకాంత్ రెడ్డి, ప్రశాంతి, యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ ఆశా వెరోనికా, సీఓలు, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



లబ్ధిదారురాలికి సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, జనవరి 20: సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ డివిజన్‌లో సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. వీకర్‌సెక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బోరబండను సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దటానికి కట్టుబడి ఉంటామన్నారు. మొత్తం 20 మంది లబ్ధిదార్లకు రూ.8లక్షల 50 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కృష్ణమోహన్, నాయకులు ఎం.ఆనంద్, రహ్మత్, బాబూరావు, రాము, రమేష్‌యాదవ్, అజయ్, జేఎల్ మేరీ, లడ్డు, బొట్టుశివ తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో సమస్యలు లేకుండా కృషి చేస్తాం

అభివృద్ధి పనుల కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి,ఎమ్మెల్యే దానం



ప్రతాప్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం, కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్,జనవరి 20: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలో రూ.84లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. పంజాగుట్ట ప్రతాప్‌నగర్, ఉప్పర్ బస్తీలలో ఏడు వీధుల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో అత్యధిక నిధులను మంజూరు చేశామని, స్థానికుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. బస్తీలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులను కూడా త్వరలో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి,డీఎంసీ ప్రశాంతి, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, రాములు చౌహాన్, నల్ల శివ. యాకరి గణేష్ పాల్గొన్నారు.

వృథాగా..తాగునీరు

వారం రోజులుగా రోడ్డుపై తాగునీరు వృథాగా పోతున్నాయి. అధికారులు, సిబ్బందికి తెలిపినా ఏ ఒక్కరూ స్పందించకపోవడంతో వారం రోజులుగా మంచినీరు రోడ్లపై కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ ఆటో స్టాండ్ ప్రాంతంలో వారం రోజుల క్రితం మంచినీటి సరఫరా చేసే పైపునకు లీకేజీ ఏర్పడింది. ప్రధాన పైపులైన్ కావడంతో నిత్యం దీని ద్వారా నీరు వృథాగా పారుతుంది.మంచినీటి పైపులైన్ పగిలి నీరు వృథా పోతున్నా వాటికి మరమ్మతులు చేయడంలో సైతం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగిలిన పైపులకు మరమ్మతులు చేసి నీటి వృథాను నివారించాలని కోరుతున్నారు.

– మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 20

బైక్ చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్,జనవరి 20: జల్సాల కోసం బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్ (26) అనే యువకుడు కొంతకాలంగా జల్సాలకు అలవాటు పడ్డాడు. డబ్బుల కోసం బైక్‌లు చోరీ చేస్తున్నారు. రెండ్రోజుల క్రితం జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో టీవీఎస్ రైడర్ బైక్‌ను చోరీ చేసిన ఇర్ఫాన్‌ను సోమవారం క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. గతంలో శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సైతం ఇర్ఫాన్ మీద కేసు నమోదైనట్లు తేలింది.

కొత్త రేషన్ కార్డుల పరిశీలన..

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో నేడు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్‌పీఆర్ హిల్స్ గ్రౌండ్స్‌లో రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమ ఏర్పాట్లను పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. (జూబ్లీహిల్స్,జనవరి20)

సమాచారం లేకుండా..వార్డు సభలా..!

- మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ

మణికొండ, జనవరి 20: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ వార్డు సభలు నిర్వహించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించినా మణికొండ మున్సిపాలిటీ అధికారులు అందుకనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణికొండ మున్సిపల్ కమిషనర్ గుట్టు చప్పుడు కాకుండా జనవరి 16న ఓ సర్కులర్ జారీ చేసి 21,22 తేదీల్లో మణికొండ పురపాలక సంఘం పరిధిలో ఏ వార్డులో ఎప్పుడు ఎక్కడ వార్డు సభ నిర్వహిస్తున్నారో తెలియజేస్తూ నామమాత్రంగా ప్రకటించారన్నారు. మీడియా పరంగా, ఇతరాత్ర ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించకుండా వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలపడం సరికాదన్నారు. ఇప్పటికైనా వార్డు సభల నిర్వహణపై ఏ కారణంతో నిర్వహిస్తున్నారో పురపాలక సంఘం అధికారులు తక్షణమే స్పందించి సామాన్య ప్రజలకు వివరాలు తెలియపరుస్తూ రేషన్ కార్డుల జారీ గురించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు.

ఆత్మరక్షణ క్రీడలు అవసరం

బాల్యంలోనే చిన్నారులు ఆత్మరక్షణ క్రీడల్లో శిక్షణ పొందాల్సిన అవసరం ఉందని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తార్నాకలో జరిగిన కుంగ్‌ఫూ పోటీల్లో బహుమతులు గెలుచుకున్న కార్మికనగర్ శాలిని కంగ్‌ఫూ మాస్టర్ ఆర్ట్స్ అండ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ చిన్నారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కుంగ్‌ఫూ మాస్టర్ వై.మనోహర్ తదితరులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్, జనవరి 20

రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో టీఎన్‌జీవోస్ కాలనీ, మధుబన్ కాలనీ, పద్మశాలిపురం రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. టీఎన్‌జీవోస్ కాలనీలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన సభ్యుల ఎన్నిక నిర్వహించారు. రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం అధ్యక్షుడిగా సి.బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్. భూపతిరెడ్డి, కోశాధికారిగా ఎం.నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.రాజవర్ధన్‌రెడ్డి, ఎల్.వెంకటేశ్వర్‌రెడ్డి, ఈ.పాండురంగారెడ్డి, బి.గోవర్ధన్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శిగా సి.రామకృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా ఏ.సుఖేందర్‌రెడ్డి, సలహాదారులుగా ఏ.మీనారెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ పొదుపు సంఘం అధ్యక్షులు సి.బుచ్చిరెడ్డి మాట్లాడుతూ సంఘంలోని ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా పొదుపు చేసి కుల బంధువులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రమేశ్ పార్థివ దేహానికి కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, టీడబ్ల్యూజేఎఫ్ నేతలు సోమయ్య, ఆనంద్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎంజీ పార్కులో టోర్నమెంట్‌కు అనుమతి ఇవ్వండి

మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న బాల్ బ్యాడ్మింటన్ సభ్యులు

మణికొండ, జనవరి 20: మణికొండ బాల్ బ్యాడ్మింటన్ చీఫ్ పాట్రాన్ ఆలస్యం నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మణికొండ బాల్ బ్యాడ్మింటన్ గతంలో గట్టుప్పల్లో జరిగిన తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ద్వితీయ బహుమతి సాధించిందన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రస్తుతం మణికొండ బాల్ బ్యాడ్మింటన్ తరపున మణికొండ అల్కాపూరిలో గల జయశంకర్ పార్కులో ఫిబ్రవరి 2న ఉదయం నుంచి రాత్రి వరకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంజీ పార్కులో బాల్ బ్యాడ్మింటన్ ఆడుకోవడానికి అనుమతి ఇవ్వాలని కమిషనర్‌ను కోరామన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బాల్ బ్యాడ్మింటన్ ముఖ్య సలహాదారులు అందె లక్ష్మణ్‌రావు, అధ్యక్షుడు ఆనంద్‌రావు, ఉపాధ్యక్షుడు బి.హరినాథ్‌రెడ్డి తదితరులున్నారు.

దినపత్రిక ఉద్యోగి మృతి

ఖైరతాబాద్ : తెలుగు దినపత్రికలో పని చేస్తున్న ఓ ఉద్యోగి అకస్మికంగా మృతి చెందాడు. ఈ ఘటన ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై బి. అమర్‌నాథ్, ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం... అల్వాల్ మచ్చబొల్లారంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే పి. శేషాచలపతి రావు (55) బంజారాహిల్స్ రోడ్డు నంబర్1లోని ఓ తెలుగు దినపత్రికలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం విధులకు బయలుదేరి ఖైరతాబాద్ బస్టాండ్ వద్దకు చేరుకోగా అక్కడ అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

శంషాబాద్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నూతనంగా నిర్మాణం చేయనున్న దవాఖానకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, తదితరులు

శంషాబాద్ రూరల్, జనవరి 20 : శంషాబాద్ మున్సిపాలిటీని ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. సోమవారం శంషాబాద్ మున్సిపాలిటీలో రూ. 5 కోట్లతో నిర్మాణం చేయనున్న 50 పడకల దవాఖాన, రూ. 2.95 లక్షలతో నిర్మాణం చేయనున్న అవుట్‌డోర్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్ మున్సిపాలిటీని ఆదర్శంగా అభివృద్ధి చేస్తానని వివరించారు. ఐదేళ్ల నుంచి కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండిగోపాల్, కమిషనర్ సుమన్‌రావు,డీఈ సాజిద్, ఏఈ నరేష్ కౌన్సిలర్లు సంజయ్‌యాదవ్,బద్రునాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మాజీ సహకార సంఘం చైర్మన్ మహేందర్‌రెడ్డి, జీఎస్ ప్రభాకర్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జ్ఞాన్‌శ్యామ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ విజయ్ కుమార్

విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయాలి

హిమాయత్‌నగర్, జనవరి 20 : విద్యార్థుల్లో దాగిన ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి కృషి చేస్తోందని చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్ఞాన్‌శ్యామ్ తెలిపారు. హిమాయత్‌నగర్‌లో సోమవారం బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జిజ్ఞాస కార్యక్రమంలో భాగంగా 'రీసెర్చ్ మెథడాలజీ, రిపోర్ట్ ప్రజెంటేషన్' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. నూతన పరిశోధనాంశాలను పరిగణంలోకి తీసుకోవడంతో పాటు ఇందులో ఎన్నో అధ్యాయన అవకాశాలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాపోలు శ్రీనివాస్, సీవీఎల్ నారాయణ, ముత్తయ్య, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాయు, శబ్ద కాలుష్యాన్ని నివారించండి

ఖైరతాబాద్, జనవరి 20 : అపార్ట్‌మెంట్ వాసులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న వాయు, శబ్ద కాలుష్యాలను నివారించాలని మై హోం మధుబన్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ సభ్యులు వి. పురుషోత్తం రెడ్డి కోరారు. శ్రీనగర్‌కాలనీలోని మై హోం మధుబన్ అపార్ట్‌మెంట్స్‌లో 88 ఫ్లాట్స్ ఉన్నాయని, దీనికి సమీపంలో ఉన్న కమ్మ సంఘం భవనంలో కొంత కాలంగా కిచెన్‌కు సంబంధించిన కాలుష్యంతో కూడుకున్న పొగను అతి తక్కువ ఎత్తులో పైపుల ద్వారా బయటకు పంపిస్తుండడంతో ఫ్లాట్స్‌లోకి ప్రవేశించి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి తోడు 325 కేవీ సామర్థ్యం కలిగిన జనరేటర్లు నిరంతరం నడిపించడం వల్ల శబ్ద కాలుష్యాన్ని భరించలేకపోతున్నామని తెలిపారు. ఈ మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లకు వినతి పత్రాలు అందజేశామన్నారు. దీనిపై అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట డివిజన్ సీఈ కాలనీ పార్కులో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఈ నెల 21మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రారంభించనున్నట్లు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి హాజరవుతున్నారని చెప్పారు.

బ్యాంకు ఉద్యోగుల పెన్షన్‌లో మార్పులు రావాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఎన్సీ జైన్

ఖైరతాబాద్, జనవరి 20 : బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ నవీకరణను వెంటనే చేపట్టాలని అఖిల భారత బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎన్సీ జైన్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశాభివృద్ధిలో బ్యాంకింగ్ రంగంలో కీలక పాత్ర పోషించారన్నారు. అలాంటి విశ్రాంత బ్యాంకు ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదన్నారు. 29 ఏండ్లుగా పదవీ విరమణ చేసిన బ్యాంకు ఉద్యోగులకు బేసిక్ పెన్షన్‌లో ఎటువంటి పెరుగుదల లేక జీవితపు చరమాంకంలో అరకొర పెన్షన్‌తో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బేసిక్ పెన్షన్ గణన కోసం సేల్ అలవెన్సు కలపాలని, విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య బీమా ప్రీమియం బ్యాంకు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ ఫెడరేషన్‌లో దేశవ్యాప్తంగా మూడు లక్షలకు పైగా సభ్యత్వాలు ఉన్నాయని తెలిపారు. బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం నేటి నుంచి 23 వరకు లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో కేంద్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 170 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్ఎం దేశ్‌పాండే, సంయుక్త కార్యదర్శులు మిత్రవశు, విశ్వనాథ్ నాయక్, ఉపాధ్యక్షులు ఆర్. లక్ష్మణ్ రావు, ఎంఎస్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమూర్తి వి. వారణాసి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో జాతీయ స్థాయి విజేతకు కలెక్టర్ అభినందన

ఖైరతాబాద్, జనవరి 20: జాతీయ స్థాయి ఖోఖోలో ప్రతిభ కనబర్చిన విద్యార్థి కలెక్టర్ ప్రశంసలందుకున్నారు. రాజ్‌భవన్ హైస్కూల్‌లో 9వ తరగతి చదవుతున్న బైరి జస్వంత్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని కొల్లాపూర్‌లో ఈ నెల 10 నుంచి 13 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు వచ్చిన క్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పీర్ కొండతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలువగా, ఆయన అభినందించారు. ఆయనతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి విద్యార్థిని ప్రశంసించారు. ఆటల్లో మరింత ముందుకెళ్లి అంతర్జాతీయ స్థాయి